# నమస్తే తెలంగాణ

# కామారెడ్డి

5 | నిజామాబాద్, గురువారం 12 సెప్టెంబర్ 2024 | KAMAREDDY


## శోభాయాత్రకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి

- కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్
- ఎస్పీతో కలిసి గణేశ్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



శోభాయాత్ర వెళ్లే మార్గాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, సెప్టెంబర్ 11 : గణేశ్ నిమజ్జన శోభాయాత్రకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ సూచించారు. జిల్లా కేంద్రంలో గణేశ్ నిమజ్జన శోభాయాత్ర వెళ్లే మార్గాన్ని ఎస్పీ సింధూశర్మతో కలిసి బుధవారం పరిశీలించారు. పట్టణంలోని స్టేషన్ రోడ్, గంజ్ రోడ్, పెద్ద బజార్, నిజాంసాగర్ చౌరస్తా మీదుగా కొత్తబస్టాండ్, ఇందిరాగాంధీ స్టేడియం వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న విద్యుత్ తీగలు, శోభాయాత్రకు ఆటంకం కలుగకుండా వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని విద్యుత్, మున్సిపల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువు వరకు శోభాయాత్ర మార్గాన్ని పరిశీలించారు.పెద్ద చెరువు వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని మున్సిపల్, పోలీసు అధికారులను ఆదేశించారు. గణేశ్ మండపాల నిర్వాహకులు జనరేటర్ సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. భక్తులకు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని, చెరువు వద్ద గజఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. వారి వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

## బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

**నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు**

కంఠేశ్వర్, సెప్టెంబర్ 11 : అక్టోబర్ 29న ఓటరు జాబితా డ్రాఫ్ట్ రోల్ ప్రకటిస్తామని, పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల పేర్లను పరిశీలించాలించేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు పోలింగ్ బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. అక్టోబర్ 29 నుంచి నవంబర్ 18లోగా రెండుసార్లు పోలింగ్ బూత్‌స్థాయిలో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తామని, డ్రాఫ్ట్ రోల్‌లో ఏమైనా అభ్యంతరాలుంటే స్పెషల్ క్యాంపెయిన్ సందర్భంగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎస్ఎస్ఆర్–2025లో భాగంగా బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి యాప్ ద్వారా ఓటర్ల పేర్లు జాబితాలో ఉన్నాయో, లేదో నిర్ధారించుకోవాలన్నారు. ఇంటింటి సర్వేకు తోడ్పాటు అందించి, ఓటరు జాబితా పక్కాగా రూపొందేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. అవసరమైన ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలను విభజించడం, కొత్త వాటిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాంటి పోలింగ్‌స్టేషన్లను గుర్తిస్తే, వివరాలను తమకు అందించాలన్నారు. అర్హులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. సమావేశంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు పవన్, సాత్విక్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీకి పెరిగిన వరద

**ఐదు గేట్ల ద్వారా నీటి విడుదల**

మోర్తాడ్/నిజాంసాగర్, సెప్టెంబర్ 11: ఎస్సారెస్పీకి బుధవారం సాయంత్రం ఇన్‌ఫ్లో పెరగడంతో అధికారులు ఐదు గేట్లు ఎత్తి దిగువ గోదావరిలోకి నీటిని విడుదల చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 28వేలపైచిలుకు క్యూసెక్కుల వరద రాగా, సాయంత్రానికి 43, 985 క్యూసెక్కులకు పెరిగింది. దీం తో అధికారులు గేట్లు ఎత్తి దిగువ గోదావరికి నీటిని విడుదల చేశారు. వరద ఉధృతి పెరగడంతో వరదకాలువకు కూడా నీటి విడుదలను పెంచారు. ప్రస్తుతం19వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్‌లోకి వస్తున్న ఇన్‌ఫ్లో ను అంతే స్థాయిలో కిందికి విడుదల చే స్తున్నారు. కాకతీయకాలువకు 6వేలు, ఎ స్కేప్ గేట్ల ద్వారా రెండువేలు, లక్ష్మీకాలువకు 150, మిషన్‌భగీరథకు 231, సరస్వతీకాలువకు 300క్యూసెక్కుల నీటి ని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థా యి నీటి మట్టం 1091అడుగులు (80.5 టీఎంసీలు) కాగా 1091అడుగులు (80.501 టీఎంసీలు) నీటినిల్వ ఉన్నది.

**నిజాంసాగర్ ఒక గేటు ద్వారా నీటి విడుదల**

నిజాంసాగర్ ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు 3500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో బుధవారం సాయంత్రం ఒక గేటు ద్వారా ఐదువేల క్యూసెక్కుల నీటిని మంజీరా నదిలోకి విడుదల చేస్తున్నారు. అలాగే ప్రధాన కాలువ ద్వారా వెయ్యి క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మొత్తం 6వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని ఏఈ శివప్రసాద్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 1405.00 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా, 1405.00 అడుగుల (17.802 టీఎంసీల) నీటి నిల్వ ఉన్నదని పేర్కొన్నారు.

## సిర్నాపల్లి సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ఆందోళన

**విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్**




సబ్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

ఇందల్వాయి, సెప్టెంబర్ 11 : విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని సిర్నాపల్లి సబ్‌స్టేషన్ వద్ద మెగ్యానాయక్ తండాకు చెందిన రైతులు బుధవారం నిరసనకు దిగారు. గన్నారం పరిధిలోని వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు సిర్నాపల్లి ఫీడర్‌పై ఉన్నాయని, విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతుండడంతో సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. వారం రోజుల నుంచి విద్యుత్ సమస్యలపై అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో నిరసన చేపట్టినట్లు తెలిపారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే పెద్ద ఎత్తున తండాలోని రైతులందరం కలిసి రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు.

## పాము కాటుతో బాలుడు మృతి



వరుణ్ (ఫైల్)

ఖలీల్‌వాడి (మోపాల్), సెప్టెంబర్ 11: నిద్రిస్తున్న ఓ బాలుడిని పాముకాటు వేయడంతో మృతిచెందాడు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం గుండ్యానాయక్ తండాలో చోటుచేసుకుంది. గుండ్యానాయక్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు నేనావత్‌రెడ్డికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు నేనావత్ వరణ్(14) ఉన్నారు. మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో నిద్రిస్తుండగా వరుణ్‌ను పాము కాటువేసింది. దీంతో బాలుడు నురగలు కక్కడంతో గమనించిన కుటుంబీకులు వెంటనే జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా.. పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. దీంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. వరుణ్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. బాలుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

### నిర్మాణానికే ఎక్కువ వ్యయం

జక్రాన్‌పల్లి వద్ద మొదటగా దేశీయ విమాన సర్వీసులను నడిపించేందుకు మినీ ఎయిర్‌పోర్టును నెలకొల్పే అవకాశాలున్నాయి. ఇందుకోసం రూ.328 కోట్లు వెచ్చించాల్సి ఉంటుందని, 510 ఎకరాల భూమి అవసరమని గతంలోనే ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నివేదిక వెల్లడించింది. అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుకు రూ.348కోట్లు, 740 ఎకరాల భూమి అవసరమని తేల్చి చెప్పింది. జక్రాన్‌పల్లి వద్ద ప్రభుత్వ భూమి ఎక్కువగా ఉంది. భూసేకరణకు ఎక్కువగా డబ్బులు ఖర్చు చేయాల్సిన అవసరం లేనందున అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు చేసినా పెద్ద భారం పడే అవకాశం లేదు. రాష్ట్రంలో కొత్తగా మొత్తం ఆరు విమానాశ్రయాల ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. కొన్ని చోట్ల భూసేకరణ చేయాల్సి వస్తోంది. భూసేకరణ, నిర్మాణాలకు పెద్ద మొత్తంలో ఖర్చు అవుతుంది. జక్రాన్‌పల్లిలో మాత్రం కేవలం నిర్మాణాలకే ఖర్చు చేస్తే సరిపోతుంది. శంషాబాద్‌లో ఇప్పటికే రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ఉండడంతో ప్రభుత్వం మాత్రం ఇక్కడ డొమెస్టిక్ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకే మొగ్గు చూపే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

### అందుబాటులో భూములు

జక్రాన్‌పల్లి వద్ద విమానాశ్రయం ఏర్పాటుపై మళ్లీ ఆశలు రేకెత్తుతున్నాయి. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా తన అధ్యయన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి గతంలోనే అందించింది. స్థలం అనుకూలంగా ఉందని పేర్కొనడమే కాకుండా ఎంత భూమి అవసరమో, ఎన్ని నిధులు వెచ్చించాలో కూడా పేర్కొంది. సర్వేకు పౌరవిమానయాన మంత్రిత్వశాఖ సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం నుంచి సమ్మతం రావాల్సి ఉంది.




### ఆకాశయానం ఆశలు ఆవిరి !

# రెక్కలు తొడగని ఆశలు

- జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టుపై మౌనం
- పదిహేను ఏండ్లుగా ఊరిస్తున్న ప్రభుత్వాలు
- అదిగో..ఇదిగో..అంటూ ప్రకటనలు
- సర్వేలు, పరిశీలనలకే పరిమితం
- కార్యరూపం దాల్చని ఏర్పాటు ప్రక్రియ
- కేసీఆర్ హయాంలో కేంద్రంతో సంప్రదింపులు..
- పట్టించుకోని జిల్లాకు చెందిన బీజేపీ ఎంపీ అర్వింద్

నిజామాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): నిజామాబాద్ జిల్లాలో ఎయిర్‌పోర్టు (విమానాశ్రయం) ఏర్పాటు అంశం ఎన్నో ఏండ్లుగా ఊరిస్తోంది. పదిహేను ఏండ్ల క్రితం ఎయిర్ ఏర్పాటు కోసం శ్రీకారం చుట్టినా ఇప్పటివరకూ పనుల్లో పురోగతి కనిపించడంలేదు. నిర్మాణ పనుల్లో ఇప్పటివరకూ ఒక్క అడుగు ముందుకు పడిన దాఖలాలు లేవు. సర్వేలు, పరిశీలనలు తప్ప కార్యరూపం దాల్చడంలేదు. ప్రభుత్వాలు కూడా నోరు విప్పడం లేదు. ముచ్చటగా మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ, రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ కనీసం పట్టించుకోవడం లేదు. ఈ రెండు పార్టీల నుంచి ఎంపీ, ఎమ్మెల్యేలుగా గెలుపొందిన వారు కూడా ఎయిర్‌పోర్టు ఊసేత్తకపోవడం గమనార్హం. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చిక్కుముడులకు పరిష్కారాన్ని కేసీఆర్ చూపించారు. ప్రభుత్వ స్థలాన్ని ఎయిర్‌పోర్టు కోసం అందుబాటులోకి తీసుకురావడంతోపాటు నిధులు వెచ్చించేందుకు సమ్మతం తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం సర్వేకు శ్రీకారం చుట్టడంలో తీవ్ర జాప్యాన్ని ప్రదర్శిస్తూ కాలాన్ని వెళ్లదీస్తోంది. ఎయిర్‌పోర్టు ఏర్పాటుతో ఉత్తర తెలంగాణ ప్రాంతానికి ఊపు వచ్చే అవకాశాలున్నాయి. జాతీయ రహదారికి అతిసమీపంలో ఉండడంతో జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టుకు అనేక అనుకూల అంశాలు కలిసొస్తున్నాయి. రైల్వే కనెక్టివిటీ సైతం కాస్తంత దూరంలోనే ఉండడం లాభిస్తున్నప్పటికీ కేంద్ర సర్కారు మీనమేషాలు లెక్కిస్తోంది. జిల్లా ఎంపీ ధర్మపురి అర్వింద్ సైతం కాలం వెళ్లదీస్తున్నాడు. విమానయానం అంశం పూర్తి స్థాయిలో కేంద్ర సర్కారు పరిధిలోనిదే అయినప్పటికీ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేంద్ర విమానయాన మంత్రిగా ఏపీకి చెందిన కింజవరపు రామ్మోహన్ నాయుడు బాధ్యతల్లో ఉన్నప్పటికీ సంప్రదింపులు చేయడంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### పట్టించుకోని జిల్లా ఎంపీ

ఎయిర్‌పోర్టు అథారిటీ పూర్తి స్థాయి నివేదికను విడుదల చేసి ఏడాదిన్నర గడిచింది. ఆ తర్వాత మరోసారి పట్టించుకున్న వారే లేకుండా పోయారు. తన లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోనే ఎయిర్‌పోర్టు అంశం ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్నప్పటికీ జిల్లా ఎంపీ ధర్మపురి అర్వింద్ ఇంతవరకూ పట్టించుకున్న దాఖలాలే లేవు. 2014 – 2019 మధ్యకాలంలో ఎంపీగా పని చేసిన కల్వకుంట్ల కవిత ఈ అంశంపై తీవ్రంగా కృషిచేశారు. ఎయిర్‌పోర్టు కోసం కేంద్రానికి పలుమార్లు వినతులు సమర్పించడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వాన్ని సమన్వయపర్చారు. ఎయిర్‌పోర్టు ఏర్పాటుతో నిజామాబాద్ జిల్లా దిశ, దశ మారే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఈ పరిస్థితిలో జిల్లా అభివృద్ధి దృష్ట్యా ఎంపీ అర్వింద్ కూడా కృషి చేయాలని ప్రతి ఒక్కరూ కోరుతున్నారు. ఎంతసేపు రాజకీయ ప్రకటనలకే పరిమితమవుతూ ప్రజలను పక్కదారి పట్టించడం కాకుండా అభివృద్ధి అంశాలపై దృష్టిసారించి, జనాల బాగు కోసం పని చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలోని ప్రస్తుత రేవంత్ ప్రభుత్వం చొరవతీసుకోవడంతోపాటు కేంద్ర సర్కారును సమన్వయం చేసుకొని పెండింగ్ సమస్యను పరిష్కరించాలని జిల్లావాసులు కోరుతున్నారు.




### రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ వహించాలి



జక్రాన్‌పల్లి, సెప్టెంబర్ 9 : ఎయిర్‌పోర్ట్ ఏర్పాటైతే మా మండలం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుంది. నిజామాబాద్ జిల్లాతో పాటు పక్క జిల్లాలైన ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ వారికి విదేశాలకు వచ్చిపోయే వారికి సౌకర్యంగా ఉంటుంది. జక్రాన్‌పల్లిలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి.

**-సంకెపల్లి రాములు, జక్రాన్‌పల్లి**




### దూరభారం తగ్గుతుంది..

జక్రాన్‌పల్లిలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేయాలి. చుట్టుపక్కల జిల్లాల్లో ముఖ్యంగా బతుకుదెరువు కోసం విదేశాలకు వెళ్లే వారు ఎక్కువగా ఉన్నారు. వారందరికీ దూరభారం తగ్గుతుంది. గల్ఫ్ కార్మికులను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుపై శ్రద్ధ చూపాలి.

**- గుడాల సాయన్న, లక్ష్మాపూర్**

## గోల్డికి శ్రద్ధాంజలి..




డాగ్ గోల్డికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న పోలీసు సిబ్బంది

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 11: నిజామాబాద్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో విధులు నిర్వహించే గోల్డి(మందుపాతరలను గుర్తించే) డాగ్ అనారోగ్యంతో బుధవారం మరణించింది. ఈ సందర్భంగా డీసీపీ కోటేశ్వర్ రావు ఆధ్వర్యంలో కుక్క మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు.అనంతరం పోలీస్ బ్యాండ్ మధ్య అంత్యక్రియలు పూర్తిచేశారు. డీసీపీ మాట్లాడుతూ.. డాగ్ గోల్డి 2016 నుంచి రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి, ఇవాంక ట్రంప్, అసెంబ్లీ, ఉప్పల్ స్టేడియం వద్ద విధులు నిర్వర్తించి, అనేక పతకాలు, ప్రశంసా పత్రాలు అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్మ్‌డ్ రిజర్వు ఏసీపీ నాగయ్య, హోంగార్డ్స్ ఏసీపీ అరుణ్ కుమార్,ఆర్ఐలు సతీశ్, తిరుపతి శ్రీనివాస్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ హన్మంత్ రెడ్డి, డాగ్ స్క్వాడ్ సిబ్బంది మనోహర్, సాయన్న, జగదీశ్, మోహ న్, శ్రీకాంత్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

### జిల్లా కోర్టు ప్రాంగణంలో
## న్యాయవాదిపై దాడి

- దాడికి పాల్పడిన మరోన్యాయవాది
- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 11: నిజామాబాద్ జిల్లా కోర్టు ప్రాంగణంలో ఓ న్యాయవాదిపై దాడి జరిగింది. కులం పేరుతో దూషించి, దాడికి పాల్పడిన వ్యక్తి పై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. నిజామాబాద్ కోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వర్తిస్తున్న వసంత్‌రావు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. బుధవారం రాజు అనే ఓ వ్యక్తి కోర్టుకు వచ్చి తను పెట్టిన క్రిమినల్ కేసు విషయంలో ప్రత్యర్థితో రాజీ పడుతున్నట్లు వసంత్‌రావును కలిసి చెప్పాడు. అనంతరం కొద్దిసేపటికి రాజు కేసులో ముద్దాయి అయిన ప్రత్యర్థి నవీన్ కూడా వసంత్‌రావు వద్దకు వచ్చి వారి కేసు విషయం చెప్పాడు. దీంతో 'మీ అడ్వోకేట్ ఎవరు?' అని వసంత్‌రావు అడుగగా.. జగన్ మోహన్ నవతే అని నవీన్ చెప్పాడు. ఆయనను తెలంగాణ బార్ కౌన్సిల్ సస్పెండ్ చేసిందని, మరో న్యాయవాదిని మాట్లాడుకొని కేసు రాజీ కుదుర్చుకోవాలని వసంత్‌రావు సూచించారు. ఈ విషయం తెలుసుకున్న జగన్ మోహన్ నవతే వెంటనే వసంత్‌రావుకు ఫోన్ చేసి కులం పేరుతో దూషించాడు. అనంతరం వసంత్‌రావును కోర్టు ప్రాంగణంలో పట్టుకొని జగన్ మోహన్ దాడి చేయడంతో ముఖంపై గాయమైంది. దీంతో వసంత్‌రావు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జగన్ మోహన్ నవతేపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు.

## కమ్యూనిటీలో సమస్యలను పరిష్కరించుకోవచ్చు

**కామారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్**




కమ్యూనిటీ మెడిటేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి డా.సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్

కామారెడ్డి, సెప్టెంబర్ 11 : జిల్లా కేంద్రంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కమ్యూనిటీ మెడిటేషన్ సెంటర్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమ్యూనిటీ మెడిటేషన్ సెంటర్ ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఎలాంటి సమస్యలనైనా పరిష్కరించేందుకు కమ్యూనిటీ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సూపరింటెండెంట్ చంద్రసేన్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ సమీఉల్లా ఖాన్, షేక్ అలీమోద్దీన్, షేక్ అబ్దుల్ లతీఫ్, విజయ్ కుమార్, నిర్మల, స్వప్న, కమ్యూనిటీ మెడిటేషన్ వలంటీర్లు పాల్గొన్నారు.

## సీఎస్పీ నిర్వాహకురాలి ఇల్లు వేలం

- డ్వాక్రా మహిళల డబ్బులు రూ.45 లక్షలు సొంతానికి వాడుకున్న వైనం
- ఇంటిని రూ.14.80 లక్షలకు దక్కించుకున్న కల్లూర్ వాసి



కల్లూరు గ్రామంలో సీఎస్పీ నిర్వాహకురాలి ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న డ్వాక్రా మహిళలు

పొతంగల్, సెప్టెంబర్ 11: డ్వాక్రా సంఘం సభ్యుల డబ్బులను తన సొంతానికి వాడుకొని, తిరిగి ఇవ్వకపోవడంతో సీఎస్పీ (కస్టమర్ సర్వీస్ పాయింట్) నిర్వాహకురాలి ఇంటికి తాళం వేసి వేలం నిర్వహించారు. ఈ ఘటన పొతంగల్ మండలం కల్లూర్ గ్రామంలో బుధవారం చోటుచేసుకున్నది. గ్రామంలోని కెనరా బ్యాంకులో సంధ్య అనే మహిళ సీఎస్పీ నిర్వాహకురాలిగా పనిచేస్తోంది. డ్వాక్రా మహిళలు బ్యాంకులో తీసుకున్న రుణాలకు సంబంధించిన కిస్తులను ప్రతినెలా సీఎస్పీ నిర్వాహకురాలికి చెల్లించగా..వాటిని ఆమె తన సొంతానికి వాడుకున్నది. సుమారు రూ. 45లక్షలు తన సొంతానికి వాడుకున్న విషయం జూలై 16న బయటపడింది. దీంతో డ్వాక్రా సంఘ సభ్యులు నిలదీయడంతో డబ్బులను తాను సొంతానికి వాడుకున్నట్లు ఒప్పుకున్నది. తనకు తిరిగి చెల్లించడానికి గడువు ఇవ్వాలని గ్రామ పెద్దల సమక్షంలో కోరగా..అందుకు సమ్మతించారు. ఇచ్చిన గడువు ముగియడంతో గ్రామ పెద్దలు, డ్వాక్రా మహిళల ఆధ్వర్యంలో ఆమె ఇంటిని బుధవారం వేలం వేశారు. వేలంలో అదే గ్రామానికి చెందిన ఒకరు రూ. 14.80 లక్షలకు దక్కించుకున్నట్లు ఐకేపీ సిబ్బంది తెలిపారు. అయితే నోట్‌పై సంతకం పెట్టడానికి సీఎస్పీ నిర్వాహకురాలి భర్త నిరాకరించడంతో కొంతసేపు ఘర్షణ వాతావరణం చోటుచేసుకున్నది. ఎట్టకేలకు సంతకం పెట్టడంతో గొడవ సద్దుమణిగింది. కొద్ది రోజుల క్రితం మొదటగా సీఎస్పీ నిర్వాహకులు 6లక్షల రూపాయలు చెల్లించగా.. మిగతా డబ్బుల కోసం ఆమె ఖాతాలో ఉన్న జమ, గోల్డ్‌లోన్ సంబంధిత వివరాలు డ్వాక్రా సంఘం మహిళలు ఆరా తీసినట్లు తెలిసింది.